క్లుప్తంగా

తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

మాడుగుల: స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన జలగాని నారాయణరావు ఇటీవల మృతి చెందాడు. అతడి భార్య నామినీ భాగ్యలక్ష్మికి సోమవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద ఎంపీపీ వేమవరపు రామధర్మజ రూ.10 వేలు అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు నామినీ బ్యాంకు ఖాతాకు జమవుతాయన్నారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి, వైఎస్సార్ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు పొలిమేర చిన్నారావు, సయ్యపురెడ్డి సత్తిబాబు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మాధవనగరంలో 'గడప గడపకు'

నాతవరం: మాధవనగరంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ హాజరయ్యే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

శంభువానిపాలెంలో పరదేశమ్మ తీర్థం నేడు



పరదేశమ్మ అమ్మవారు

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు శంభువానిపాలెంలో మంగళవారం పరదేశమ్మ అమ్మవారి తీర్థాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లిస్తారన్నారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, రాత్రి పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పోటీ పరీక్ష పుస్తకాల పంపిణీ



విద్యార్థులు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాత

రోలుగుంట: బుచ్చింపేట గ్రామానికి చెందిన ఉద్యోగి అనిమిరెడ్డి రమణ తన సొంత నిధులతో 150 మంది నిరుపేద యువతకు పోటీ పరీక్ష పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో ఉద్యోగం చేస్తూ.. తన జీతంలో కొంత మొత్తం నిరుపేద విద్యార్థులకు సాయమందించేందుకు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రికెట్ పోటీల్లో బూరుగుపాలెం జట్ల సత్తా



బూరుగుపాలెం జట్టుకు బహుమతి అందిస్తున్న సర్పంచ్

మాకవరపాలెం: జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో బూరుగుపాలెం గ్రామానికి చెందిన జట్లు తమ సత్తా చాటుకున్నాయి. ఈ గ్రామంలో ఆదివారం పరదేశమ్మ పండగ సందర్భంగా గత నెల 25 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయి. ఇందులో బూరుగుపాలెం గ్రామానికి చెందిన జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ప్రథమ బహుమతిగా సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రుత్తల బుచ్చన్న నాయుడు రూ.10 వేలు పండగ రోజు రాత్రి ప్రదానం చేశారు.

సంక్షేమ లబ్ధితో ప్రతి కుటుంబంలో వెలుగులు

- 'గడప గడపకు' కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సీఎం జగన్ అండగా ఉన్నాడంటూ డిప్యూటీ సీఎంకు వివరిస్తున్న వృద్ధురాలు

కె.కోటపాడు: ప్రతీ కుటుంబానికి పార్టీలకతీతంగా సంక్షేమ లబ్ధిని కల్పించి వారి అభ్యున్నతికి సహకారం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం చౌడువాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి మూడేళ్లలో సీఎం జగన్ అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తన పెద్దకుమారుడిలా సీఎం జగన్ తనకు సంక్షేమ లబ్ధిని కల్పిస్తున్నాడని గ్రామానికి చెందిన దీవి రాజులమ్మ ఆనందం వ్యక్తం చేసింది. తన కుటుంబానికి మూడేళ్లలో అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాలు అందడం ద్వారా రూ.3.70 లక్షల లబ్ధి కలిగిందని పాతరపల్లి గంగమ్మ ఆనందంతో వివరించింది. చౌడువాడ, గరుగుబిల్లి ప్రాథమిక పాఠశాలల్లో నాడు–నేడు పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాలను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, వారాధి అప్పారావు, రాజి శ్రీనివాసరావు, ఆకుల సాయి ప్రసాద్, చల్లా సురేష్, ఎంపీడీవో శచీదేవి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, బండారు దేముళ్లు, బోళెం కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగిస్తాం

- తహసీల్దార్ కనకారావు



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ కనకారావు

నాతవరం: గ్రామాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను ఖాళీ చేయించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పి.కనకారావు ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని ఆక్రమణ భూములను స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని దండోరా ద్వారా తెలియజేయాలన్నారు. గడువులోపు ఖాళీ చేయకపోతే రెవెన్యూ సిబ్బంది పోలీసు బందోబస్తుతో ఖాళీ చేయించాలన్నారు. మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు భూమి కావాలన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి చర్యలు చేపట్టాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సివిల్ సప్లయ్ డీటీ చందన, ఆర్ఐలు మధు, నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి. కృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

మరోసారి అర్జీదారు వచ్చే పరిస్థితి తేవొద్దు

- స్పందనకు 36 అర్జీలు : ఆర్డీవో జయరాం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందనలో 36 అర్జీలు వచ్చాయని ఆర్డీవో హెచ్.వి.జయరాం తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం స్పందనలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వీటిల్లో ఎక్కువగా భూసమస్యలు, సదరం సర్టిఫికెట్లు, పింఛన్ల పునరుద్ధణ వంటి సమస్యలు ఉన్నాయి. స్పందన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీవో ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఒక సారి స్పందనకు వచ్చిన ఫిర్యాదు మరోసారి రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసీల్దార్ అన్నాజీరావు, సీడీపీవో మేరీ సువార్త, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామల, ఎలక్ట్రికల్ ఏడీఏ సత్యానందం వ్యవసాయ శాఖ ఏడీ వంగపండు మోహన్‌రావు, ఇరిగేషన్ ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

8 వేల వేతనదారులకు ఉపాధి కల్పన లక్ష్యం



చెరువులో పని చేస్తున్న వేతనదారులు

నాతవరం: వచ్చే వారంలోగా రోజు ఒక్కంటికి ఎనిమిది వేల మంది వేతనదారులకు ఉపాధి పని కల్పించడమే ధ్యేయంగా పని చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. నాతవరం, వల్సంపేట, తాండవ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను స్వయంగా పరిశీలించారు. సోమవారం 5,450 మంది కూలీలు పని చేశారని, వచ్చే వారం నుంచి లక్ష్యాన్ని అధిగమించేందుకు ఏపీవో, టీఏర్పీలు కృషి చేయాలన్నారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం కూలీలు సంఖ్య పెంచాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే పని కల్పించాలన్నారు. పనికి వచ్చే కూలీలు గిట్టుబాటు ధర వచ్చేలా పని చేయాలన్నారు. సకాలంలో కూలి చెల్లిస్తామన్నారు. ఏపీవో చిన్నారావు, టీఆర్పీ సత్యనారాయణ పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులకే ఉపాధి

మాడుగుల రూరల్: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఏపీవో ఎస్. వరహాలుబాబు తెలిపారు. మండలంలో వివిధ చోట్ల ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశించిన ప్రకారం పనిచేస్తే రోజుకూ రూ. 257 అందుతాయన్నారు. మండలంలో చెరువులు, పంట కాలువలు, మట్టిరోడ్ల నిర్మాణం, వరదగట్లు, వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మూడు వేల మంది వేతనదారులు పనిచేస్తున్నారన్నారు. కొబ్బరి, జీడి మామిడి, మామిడి, వంటి మొక్కలకు రింగ్ ట్రెంచ్‌లు (మొక్కలు చుట్టూ కందకాలు తవ్వడం) చేపడతామన్నారు. దీనికి సంబంధించి రైతులు తమ జాబ్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రమే ప్రభుత్వ ధ్యేయం



సీఐ గణేష్ సమక్షంలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నర్సీపట్నం: డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని టౌన్ సీఐ ఎస్.గణేష్ అన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేస్తూ రూపొందించిన హోర్డింగ్‌లను పట్టణంలో ప్రధాన కూడళ్ల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతంగా చదువుకుని కుటుంబాలకు అండగా నిలవాల్సిన యువకులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఫలితంగా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టిందన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగిస్తే ఎస్‌బీఐ టోల్ ఫ్రీ నంబరు 14500కు కాల్ చేయాలని సూచించారు.

పాడి రైతులను లక్షాధికారులుగా చేసేందుకు కృషి

- విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆనందకుమార్



మాట్లాడుతున్న విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆనందకుమార్

మాడుగుల: రాత్రులు, పగలు కష్టపడుతున్న పాడి రైతులను లక్షాధికారులను చేయడమే విశాఖ డెయిరీ లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా అనేక రాయితీలు అందిస్తుందని ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ తెలిపారు. విశాఖ డెయిరీ ఛైర్మన్‌గా ఎంపికై తొలిసారిగా వచ్చిన ఆయనకు మోదకొండమ్మ ఆలయం వద్ద ఆలయ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, షేక్ ఉన్నీషా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకుడు పెరుమళ్ల వెంకటరావు, మాడుగుల, చీడికాడ మండలాల పాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఆలయ సమీపంలో తులసీ కల్యాణ మండపంలో డెయిరీ డైరెక్టర్లు సీరంరెడ్డి సూర్యనారాయణ, గేదెల సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఆనందరావు మాట్లాడారు. దివంగత విశాఖ డెయిరీ ఛైర్మన్ తులసీరావు ఆశయ సాధనకు రైతు లు, సిబ్బంది సహకారంతో అమూల్‌కు దీటు గా అభివృద్ధి బాటలో నడిపించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 1996లో 11 బల్క్ కూలర్లతో ప్రారంభించగా, నేడు వందకు పైగా ఉన్నాయన్నారు. కరోనాలో డెయిరీ సిబ్బందికి పూర్తి స్థాయిలో జీతం అందించి, రైతులకు పేమెంట్స్ అందించిన ఘనత విశాఖ డెయిరీకి దక్కిందన్నారు. ప్రస్తుతం రోజుకు 9 లక్షల లీటర్ల పాలు సరఫరాను పది లక్షలకు పెంచే విధంగా రైతులు సిద్ధం కావాలని కోరారు. రోజుకు రూ. 44 లీటర్లు పాలు ఉత్పత్తి చేసే మేలు జాతి పశువులు ఉన్నాయని, వాటిపై రైతులు దృష్టి సారించి అధిక లాభాలు పొందాలన్నారు. ప్రస్తుతం చెరకు ఫ్యాక్టరీల పరిస్థితులు బాగోలేకపోవడంతో రైతులు పాడి పరిశ్రమపై ఆధార పడుతున్నారన్నారు. రైతులను ఆదుకోవడానికి ఇప్పటికే కార్పొరేట్ స్థాయిలో డెయిరీ ఆస్పత్రి అభివృద్ధి చెందిందన్నారు. క్యాన్సర్ బ్లాక్ ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అంతకు ముందు తులసీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ శానాపతి కొండలరావు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక పాల సంఘం కార్యదర్శి జోగినాయుడు, విశాఖ డెయిరీ మేనేజర్లు, సూపర్ వైజర్లు, పాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తులు

నర్సీపట్నం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీ హెల్పర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో మేరీ సువార్త సూచించారు. మున్సిపాలిటీ 18వ వార్డు బలిఘట్టం 6వ అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీ హెల్పర్ పోస్టుకు ఎస్సీ కులానికి చెందిన అభ్యర్థులు ఈ నెల 7 నుంచి 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

693 జీవాలకు పీపీఆర్ టీకాలు

మాడుగుల: మండలంలో పశువైద్య సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి మూణ్నెల్లు దాటిన గొర్రెలకు, మేకలకు ఉచితంగా పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. దీనిలో భాగంగా జాలంపల్లి పంచాయతీలో వంద గొర్రెలకు, 200 మేకలకు, గొటివాడ అగ్రహారంలో 87 గొర్రెలకు, పోతన పూడిలో 80 గొర్రెలకు, 26 మేకలకు, శంకరంలో 60 గొర్రెలకు, 140 మేకలకు టీకాలు వేశామన్నారు. ఇంతవరకు మండలంలో 693 జీవాలకు పీపీఆర్ టీకాలు వేశామన్నారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంట షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఆనందకుమార్

బుచ్చెయ్యపేట: స్థానిక బెస్లింగ్ చర్చి వద్ద వంటషెడ్డుకు విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల బుచ్చెయ్యపేట, దిబ్బిడి గ్రామాల మధ్య కొత్తగా చర్చి నిర్మించారు. ప్రతి ఆదివారం వందలాది మంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు తర్వాత అన్నసమారాధన చేస్తారు. విశాఖ డెయిరీ ఛైర్మన్ దివంగత ఆడారి తులసీరావు స్మారకార్థంగా వంటషెడ్డు నిర్మించనున్నారు. డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం పాల్గొన్నారు.

ఎడమ కాలువ పనులు చేయాలని డిమాండ్

మాడుగుల రూరల్: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పెద్దేరు ఎడమ కాలువ పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి, గిరిజన భూములకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న, ఇ. నర్సింహమూర్తి, కె. భవానీ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఓంద్రువీధి, ఎల్. గవరవరం, కృష్ణంపాలెం, గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెద్దేరు ఎడమ కాలువ ద్వారా మూడు పంచాయతీలకు సంబంధించి 1,500 ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో అప్పట్లో భూ సేకరణ చేసి, రైతులకు నష్ట పరిహారం చెల్లించారన్నారు. అయితే కాలువ పనులు ఇంతవరకూ పూర్తి కాలేదని వాపోయారు.

వైభవంగా పుష్పాంజలి సేవ



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

చీడికాడ: అర్జునగిరి స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం పుష్పాంజలి సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

గుండాట ఆడిస్తున్న ఇద్దరి అరెస్టు

చోడవరం రూరల్: గుండాట ఆడిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నర్సయ్యపేటలో బళ్లాట ఆడిస్తూ జూదాన్ని ప్రోత్సహిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో ఎస్ఐ బి.అప్పలనాయుడు తమ సిబ్బందితో దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి బళ్లాటకు వాడే పట్టాలు, రూ. 460 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులిపై కేసు నమోదు చేశామన్నారు.

కుమ్మరి కులస్తులకు ప్రభుత్వం చేయూత

అనకాపల్లిటౌన్ : కుమ్మరి కులస్తులను ప్రభుత్వం చేయూత ద్వారా ఆదుకుంటుందని కుమ్మరి శాలివాహన సంఘాల డైరెక్టర్ దేవరపు అర్జున వెంకటరావు అన్నారు. గుండాల కూడలిలోని ప్రైవేటు భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులస్తులందరూ ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అర్హులై ఉండీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు రాని వారుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతకు ముందు ఆయన సంఘ పెద్దల సమక్షంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ అప్పలకొండ, కార్యదర్శి రామస్వామి, కోశాధికారి ఎం.సత్యనారాయణ, జిల్లా నేతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



కొత్తకోటలో ప్రజల సమస్యలు వింటున్న ధర్మశ్రీ

రావికమతం: నియోజకవర్గంలో ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ముందున్న లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మూడో రోజు సోమవారం కొత్తకోట 4, 5వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, ఎవ్వరైనా లంచాలు అడుగుతున్నారా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో ప్రధానంగా గట్టా అప్పారావు ఇంటి నుంచి గుమ్ముడు శ్రీను ఇంటి వరకు, కిరణ్ ఇంటి నుంచి ఆలయం వరకూ డ్రైనేజీ పూడికపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వార్డువాసులు వాపోయారు. వాటిని నిర్మించాలని కోరారు. ఇంటింట కుళాయిల వల్ల సీసీరోడ్లు ధ్వంసమయ్యాయని, వాటిని సరిచేయాలని గుమ్ముడు సరోజిని, గట్టా పార్వతి, కుమారి విన్నవించారు. వీటిని పరిష్కరిస్తామని ధర్మశ్రీ భరోసా ఇచ్చారు. ఎంపీపీ పైల రాజు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, భవానీ ప్రసాద్, ఎంపీడీవో వెంకన్నబాబు, మండల సచివాలయ కన్వీనర్ జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, శీలం శంకర్రావు, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, కొత్తకోట -1, 2, 3 ఎంపీటీసీలు కుంచా లక్ష్మి, పూడి దేవా, పైల చినమ్మ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు తెలుసుకున్న ఆర్డీవో



గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

రోలుగుంట: నర్సీపట్నం ఆర్డీవో సోమవారం సాయింత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. గిరిజన గ్రామాల సమస్యలపై ఆరా తీశారు. నూతన పంచాయతీ అర్ల శివారు పీత్రిగెడ్డ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆ గ్రామానికి తహసీల్దార్‌ను వెంటబెట్టుకుని వెళ్లారు. అక్కడ గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. తమకు అంగన్‌వాడీ కేంద్రం లేదని, బడిఈడు పిల్లలున్నా ఎంపీపీ పాఠశాల లేదని వారు వాపోయారు. దీనిపై ఆర్డీవో స్పందించి సంబంధిత శాఖల అధికారులతో చర్చిస్తానన్నారు. 23 మందికి జన్మదిన ధ్రువపత్రాలను వైస్ ఎంపీపీ దోసపత్ని వరలక్ష్మి చేయించినట్టు తెలుసుకున్నారు. మిగిలిన వారికి సత్వరమే ధ్రువపత్రాలను అందించాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. శరభవరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దోసపత్ని రాజు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

- టీడీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టండి
- కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



గృహసారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహసారథులు

నర్సీపట్నం: పార్టీలకతీతంగా అర్హులందరికీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. టీడీపీ పాలనలో దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయ ఆవరణలో సోమవారం నర్సీపట్నం మండలం సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వీరంతా సమన్వయంతో పని చేసి టీడీపీ నాయకుల దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. టీడీపీ పాలనలో అవినీతి రాజ్యమేలిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకునేందుకు మనమంతా సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రతి ఇంటికి వెళ్లి వారి అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఏ ఒక్క అర్హుడికి అన్యాయం చేయకూడదనేదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 సీట్లు విజయం సాధించడం ఖాయమన్నారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికీ అద్భుతమైన పాలన అందిస్తున్నారన్నారు. అందుకు నిదర్శనం స్థానిక సంస్థల ఎన్నికల విజయాలేనన్నారు. అర్హులందరికీ సకాలంలో సంక్షేమ ఫలాలు అందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారన్నారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైస్ ఎంపీపీ తాతబాబు, పార్టీ మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ శానాపతి వెంకటరత్నం, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పి.రమణమ్మ, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం రూ.73 లక్షలతో చేపట్టనున్న ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులకు సోమవారం ఆయన మాకవరపాలెంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.వంద కోట్లతో రెండో విడతగా జల్‌జీవన్ మిషన్ పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. తాగునీటి ఇబ్బందులు లేని గ్రామాలే లక్ష్యంగా చర్యలు తీసుకుంటుందన్నారు. తహసీల్దార్ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు సర్వేశ్వరరావు, నాయకులు పెట్ల భద్రాచలం, గొంతిన హరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదర్శనరావు పాల్గొన్నారు.

గౌరీశ్వరస్వామికి ఘనంగా ఉత్సవ రాట

- కల్యాణ మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



స్వామివారి పెళ్లిరాట వేడుకలో వేద పండితులు

చోడవరం: అతి ప్రాచీన దేవాలయమైన స్వయంభూ గౌరీశ్వరస్వామివారి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం ఉత్సవ రాట వేశారు. ఉత్తరాంధ్రలో పురాతన దేవాలయాల్లో ఒకటైన చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి పెళ్లి రాట వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవ రాట వేసిన దగ్గర నుంచి కల్యాణ ఉత్సవాలకు సంబంధించి పనులు ప్రారంభిస్తామని ప్రధాన అర్చకుడు తెలిపారు. దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, ట్రస్టు బోర్డు ఛైర్మన్ గూనూరు సత్తిబాబు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.